
సాక్షి పల్నాడు

గురువారం । 7 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికల వలవన్ దంపతులు బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.

యార్డుకు 1,44,511 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,44,511 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,38,827 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఉద్యోగినులకు ఆటల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ, ఇంజినీరింగ్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగినులకు జెడ్పీ ప్రాంగణంలోని మైదానంలో ఆటల పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సమాజంలో పురుషులతో పోటీ పడి మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. నిరంతరం వృత్తి జీవితంలో బిజీగా ఉంటున్న ఉద్యోగినుల్లో ఉత్సాహం నింపేందుకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు మూడు రోజులు సెలవులు

కొరిటెపాడు(గుంటూరు) శివరాత్రి పండుగ సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అంతేకాకుండా శని, ఆదివారాలు సాధారణ సెలవులు కలుపుకొని మొత్తం మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ సెక్రటరీ, యార్డు ఇన్‌చార్జి సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డులో 11వ తేదీ నుంచి యథావిధిగా క్రయ, విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. సెలవు రోజుల్లో రైతులు మిర్చి బస్తాలను యార్డుకు తీసుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాజీబాబా ఆదాయం రూ.13.28 లక్షలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ కానుకల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగిందని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా అన్నారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు బుధవారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ షేక్ హైదర్ బాషా పర్యవేక్షణలో వీడియో నిఘా, పోలీసు బందోబస్తుతో కానుకల లెక్కింపు చేపట్టారు. దర్గాలోని మొత్తం 6 హుండీలు ద్వారా బాజీబాబా వారికి రూ.13,28,050 ఆదాయం లభించింది. గడిచిన ఐదు నెలల కాలానికి ఈ ఆదాయం లభించిందని ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ షేక్ ఆదం షఫీ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభానీ, రెవెన్యూ, పోలీసు, దర్గా సిబ్బంది, కెనరాబ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల అడిషనల్ ఎస్పీ బదిలీ

అడిషనల్ ఎస్పీగా విఠలేశ్వర్ నియామకం

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పి.మహేష్‌ను విశాఖపట్నం జిల్లా, క్రైం విభాగం అడిషనల్ డీసీపీగా బదిలీ చేశారు. బాపట్ల జిల్లాకు ఏసీబీ విభాగంలో అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి.పి.విఠలేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది.

ఎక్సైజ్ శాఖ డీసీగా బాబ్జీరావు



నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు జోన్ డెప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు బుధవారం గుంటూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జోన్ డీసీగా పనిచేస్తున్న బాబ్జీరావు గుంటూరు జోన్ డీసీగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డీసీగా పనిచేసిన టి.శ్రీనివాసరావు ఏపీఎస్‌బీసీఎల్ డీజీఎంగా బదిలీపై హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లారు.

నిమ్మకాయల ధరలు


తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6000, గరిష్ట ధర రూ.7700, మోడల్ ధర రూ.6800 వరకు పలికింది.

గుండె నిండా గుడిగంటలు

- ఏకాదశి పర్వదినాన త్రికోటేశ్వరుడిని దర్శించుకున్న భక్తజనం
- కిటకిటలాడిన అన్ని క్యూలైన్లు
- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న భక్తుల రద్దీ
- కొండకు చేరుకున్న కాకాని భారీ విద్యుత్ ప్రభ
- కొండపైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

కోటప్పకొండపై ప్రారంభమైన తిరునాళ్ల సందడి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో తిరునాళ్ల సందడి ప్రారంభమైంది. ఏకాదశిని పురస్కరించుకుని త్రికోటేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహాశివరాత్రి పర్వదినమైన ఈనెల 8వ తేదీ శుక్రవారం వరకు కొండపై భక్తుల తాకిడి నెలకొననుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు బుధవారం అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఉచిత, శీఘ్ర, ప్రత్యేక, అభిషేక దర్శనాలను భక్తులకు కల్పించారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో రద్దీ కనిపించింది. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 3వ తేదీ నుంచే మూలవిరాట్ అభిషేకాలను నిలిపివేశారు. శనివారం వరకు అభిషేక మండపంలోనే అభిషేకాలు నిర్వహిస్తారు. మహా నందీశ్వరుడు, ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, ధ్యానశివుడు వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మొక్కుబడి భక్తులు సోపాన మార్గంలో మెట్ల ద్వారా కొండపైకి చేరుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కొండపైకి ఏర్పాటుచేసింది. ఘాట్‌రోడ్డులో, కొండపై పార్కింగ్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఘాట్ రోడ్డులోని ప్రకృతి పర్యావరణ కేంద్రం వద్ద యాత్రికుల సందడి నెలకొంది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి చిన్నారులు బాలప్రభలతో కొండకు వచ్చారు.



త్రికోటేశ్వర స్వామి



కాకాని భారీ ప్రభ ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే..

త్రికోటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండమీద నూతనంగా నిర్మించిన రెండు గెస్ట్‌రూమ్‌లను ఆయన ప్రారంభించారు. అలాగే పాతకోటయ్య స్వామి ఆలయానికి ఏర్పాటుచేయనున్న మెట్ల మార్గానికి భూమి పూజ చేశారు. యల్లమంద వద్ద రూ.1.9కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. చిలకలూరిపేట మేజర్ కెనాల్ వద్ద నిర్మాణంలో ఉన్న శివకుటుంబాన్ని పరిశీలించారు. ఆలయ ట్రస్టీ రామకృష్ణకొండలరావు, ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, గంగుల వెంకటేశ్వరరెడ్డి, ఇండ్ల కోటేశ్వరరావు, కొత్తూరి గోపి, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



త్రికోటేశ్వరుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు

కొండకు చేరుకున్న కాకాని ప్రభ..

కాకాని వైఎస్సార్ సీపీ భారీ విద్యుత్ ప్రభ బుధవారం సాయంత్రం కొండకు చేరుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రభకు పూజలు నిర్వహించి ట్రాక్టర్ నడిపారు. అనంతరం ప్రభ పెట్లూరివారిపాలెం, చిలకలూరిపేట మేజర్, గురవాయపాలెం మీదగా కొండకు చేరుకుంది. 75అడుగుల ఎత్తుతో రూ.20లక్షల వ్యయంతో ప్రభను నిర్మించారు. గ్రామ సర్పంచ్ కంచేటి వీరనారాయణ, ఇన్‌చార్జ్ సర్పంచ్ అడపా ప్రసాద్, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

'దేశం'లో గందరగోళం!

సీట్లపై స్పష్టత రాక ఆందోళనలో తమ్ముళ్లు

- నరసరావుపేట, గురజాల, పెదకూరపాడు అభ్యర్థులపై ఎటూ తేల్చని టీడీపీ
- చంద్రబాబు గురజాల 'రా కదలిరా' సభలో ప్రకటిస్తాడని ఆశలు పెట్టుకున్న తమ్ముళ్లు
- యరపతినేనిని గెలిపించండి అని ఒక్కమాట అనని బాబు
- రూ.కోట్లు ఖర్చు చేసినా క్లారిటీ ఇవ్వకపోవడంపై యరపతినేని అలక
- పెదకూరపాడులో మా కంటే మాకే సీటు అంటున్న కొమ్మాలపాటి శ్రీధర్, భాష్యం ప్రవీణ్
- డైలమాలో నరసరావుపేట ఆశావహులు

సాక్షి, నరసరావుపేట: మరో వారం పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని వార్తలు వెలువడుతున్న వేళ పల్నాడు జిల్లాలోని గురజాల, నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల నేతల్లో ఆందోళన రేపుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితా ఎప్పుడు వస్తుందో, అందులో తమ పేరు ఉందో లేదో తెలియక సతమతమవుతున్నారు. తెలుగుదేశం పార్టీ తొలి విడత ఎమ్మెల్యేల జాబితాలో ఈ నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు ప్రకటించలేదు. పైగా అక్కడ ఇన్‌చార్జిలుగా ఉన్న నేతల స్థానాల్లో కొత్తవారు పోటీ చేస్తారన్న వార్తలు వారిలో మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. గత శనివారం చంద్రబాబు నాయుడు హాజరైన గురజాల రా..కదలిరా సభలో ఈ నియోజకవర్గాల అభ్యర్థిత్వంపై స్పష్టత వస్తుందని టీడీపీ నేతలు భావించారు. అయితే బాబు ఆ విషయాల జోలికి పోకుండా సభ ముగించి వెళ్లిపోయారు. దీంతో వారిలో ఆందోళన మరింత పెరిగింది.

యరపతినేని అలక...

తొలి జాబితాలో గురజాల ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు లేకపోవడం తీవ్ర అవమానంగా భావిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. పార్టీలో సీనియర్ అయిన తన పేరు లేకపోవడం ఏంటని చిందులు తొక్కారట. దీన్నుంచి బయటపడటానికి రా..కదలిరా సభను తన నియోజకవర్గంలో నిర్వహించి, అధినేతతో తన పేరు ప్రకటించుకోవాలని యరపతినేని కోట్ల రూపాయలు ఖర్చు చేశారట. అయినా బాబు యరపతినేని ఇక్కడి నుంచే పోటీ చేస్తారు గెలిపించండి అని ఒక్క మాట అనలేదట. దీంతో యరపతినేని తీవ్ర ఆవేదనకు లోనైనట్టు తెలుస్తోంది. అసలు తనకు గురజాల నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తాడా లేదా చెప్పండి అంటూ తెలిసిన వారి దగ్గర వాపోతున్నారట.

నాదంటే నాదే సీటు...

పెదకూరపాడు సీటు విషయంలోనూ చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అక్కడ టికెట్ కోసం పోటీ పడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, భాష్యం ప్రవీణ్‌లు నాదంటే నాది అంటున్నారట. బాబు నోటి నుంచి ఎవరి పేరు చెప్పకపోయినా తన అనుచరులతో మాత్రం ఇద్దరూ మాకే సీటు గ్యారెంటీ అంటూ భరోసానిస్తున్నారట. ఒకటి రెండు రోజుల్లో ప్రచారం ప్రారంభిస్తామంటూ రెండు శిబిరాలు ప్రకటనలు చేస్తున్నారు. ఇద్దరిలో ఎవరికో ఒకరికి సీటు ఇవ్వమని స్థానిక నేతలు తలలుపట్టుకుంటున్నారట.

నరసరావుపేటలో మూడు కుర్చీలాట..

జిల్లా కేంద్రం నరసరావుపేటలోను ఇదే గందరగోళం నెలకొంది. ప్రస్తుత ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబుకు టికెట్ ఇవ్వరని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని ఇక్కడినుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం జరిగింది. ఇందుకు బలం చేకూర్చేలా ఐవీఆర్ఎస్ కాల్స్ సైతం వచ్చాయి. దీంతో చదలవాడతో పాటు ఇక్కడ పోటీ చేయాలని చూస్తున్న కడియాల, నల్లపాటి వర్గాల్లో ఆందోళన నెలకొంది. మాలో ఎవరో ఒకరికి సీటు ఇవ్వండని, యరపతినేనికి ఇస్తే సహకరించబోమని అధిష్టానానికి తెలిపినట్టు సమాచారం. గురజాల సభ తరువాత సీటు తనకే వస్తుందన్న నమ్మకం ఉందంటూ చదలవాడ తన అనుచరులతో చెప్పుకుంటున్నారట. మొత్తం మీద రెండోజాబితా వచ్చేవరకు నరసరావుపేట, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల టీడీపీ క్యాడర్‌లో ఆందోళన తప్పదన్న వార్తలు వినిపిస్తున్నాయి. అసలే జిల్లాలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న వేళ ఇలా అభ్యర్థుల ప్రకటన ఆలస్యం చేయడం ఏంటని వాపోతున్నారట.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- ఆర్టీసీ బస్సులకు వన్‌వే అమలు
- 3,000 మంది సిబ్బందితో బందోబస్తు
- పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: మహాశివరాత్రికి కోటప్పకొండ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. త్రికోటేశ్వరస్వామి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్‌శాఖ తరఫున చేసిన ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా వన్‌వేలను ప్రవేశపెట్టామన్నారు. కొండ పరిసరాలలో పార్కింగ్ సమాచారం కోసం కోటప్పకొండ పార్కింగ్ యాప్ రూపొందించినట్లు తెలిపారు. దీన్ని భక్తులు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రూట్లు, పార్కింగ్, యాప్ తదితర సమాచారాన్ని పోలీస్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రొటోకాల్ దర్శనానికి ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. సుమారు 3,000 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో నిర్వర్తించనున్నట్లు చెప్పారు. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సమస్యలు రానున్న నేపథ్యంలో ఆయా కంపెనీల నుంచి తాత్కాలికంగా కొన్ని టవర్లను ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. మత్తు పదార్థాలు తాగడం నిషేధమని చెప్పారు. రాజకీయ, వర్గాల సంబంధిత సాంస్కతిక కార్యాక్రమాల నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే కొండపైకి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్బీ సీఐ ప్రభాకర్ ఉన్నారు.

నరసరావుపేట వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే వారు ...

- నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చు భక్తులు/వీఐపీలు వారి వాహనాలు, ఆర్టీసీ బస్సులలో ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి.
- తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక వైపు ఏర్పాటు చేయబడిన మట్టి రోడ్డును ఉపయోగించి కొండకావూరు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జేఎన్‌టీయూ కాలేజీ మీదుగా కాకాని రోడ్‌లో వెళ్లాలి.

సంతమాగులూరు వైపు నుంచి..

- సంతమాగులూరు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డును ఉపయోగించి మిన్నెకల్లు, గురిజేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మిన్నేకల్లు నుంచి కోటప్పకొండ వైపు అనుమతించబడవు.
- సంతమాగులూరు నుంచి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.

చిలకలూరిపేట వైపు నుంచి..

- చిలకలూరిపేట నుంచి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమవైపుకు తిరిగి క్రషర్ రోడ్‌ను ఉపయోగించి వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచి, వీఐపీ బస్‌లలోనే కొండపైకి చేరుకోవాలి.
- తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు చేరి చిలకలూరిపేట వెళ్లాల్సి ఉంటుంది.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి నిధి దారి గుండా ప్రభల స్టాండుకు చేరాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్, యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- చిలకలూరిపేట వైపు తిరిగి వెళ్లే భక్తులు శారద ఫార్మసీ దగ్గరలో పార్కింగ్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు యూటీ జంక్షన్ చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా గోవిందాపురం, కోమటినేనివారి పాలెం మీదుగా నరసరావుపేట- చిలకలూరిపేట రోడ్డుకు చేరి చిలకలూరిపేట వెళ్లాల్సి ఉంటుంది.
- గంగన్నపాలెం, కోమటనేనివారి పాలెం నుంచి వచ్చే భక్తులు గోవిందాపురం, కమ్మవారిపాలెం మీదుగా మద్దిరాల చేరి యడవల్లి యూటీ జంక్షన్‌ల మీదుగా పార్కింగ్ ప్రదేశం చేరాలి.
- అవిశాయపాలెం, కేసానుపల్లి మీదుగా కోటప్పకొండకు వచ్చే భక్తులు ఎస్ఆర్‌కేటీ చేరి, యలమంద గ్రామం మీదుగా కోటప్పకొండ రావాలి.
- యలమంద, గురువాయపాలెం వైపు నుంచి వచ్చు భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్ వద్దకు చేరి, యాదవ సత్రానికి వెనుక ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకోవాలి.



మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, చిత్రంలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సీఐ ప్రభాకర్

ప్రభలు ఇలా...

- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు ఉదయం 10 గంటలకు బయలదేరి యల్లమంద, గురవాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 4 గంటలకు ప్రభల నిధి వద్దకి చేరుకోవాలి.. తరువాత అనుమతి ఉండదు.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి రాత్రి ఒంటిగంట తరువాత తిరిగి వెళ్లే వాహనాలు ఐరన్ బ్రిడ్జి మీదుగా గోనేపూడి, కేసానుపల్లి మీదుగా నరసరావుపేట వైపునకు గాని చిలకలూరిపేట వైపునకు గాని వెళ్లాల్సి ఉంది.
- ఏఎం రెడ్డి కాలేజ్ జంక్షన్ నుంచి వాహనాలు బైకులకు కాలుకట్ట పైకి అనుమతి లేదు.
- కొండపైకి నడిచి వెళ్లే భక్తులు మెట్ల దారిలో మాత్రమె నడచి వెళ్లాలి.. ఘాట్ రోడ్‌లో భక్తులు కాలి నడకన వెళ్లేందుకు ఎలాంటి అనుమతులు లేవు.

5,897మంది రైతులకు రూ.4.89కోట్లు

ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కు అందజేసిన జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన 5,897 వ్యవసాయ, ఉద్యాన రైతులకు రూ.4,89,09,000లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించిన ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టరేట్ నుంచి వీక్షించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ తుపాన్ కారణంగా 3,315.54 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ కార్యాలయ ఏడీ సీహెచ్.రవికుమార్, ఏడీఏ పి.మస్తానమ్మ, డీటీసీ, డీఆర్‌సీ బి.శివకుమారి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న జేసీ శ్యాంప్రసాదు

క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



మాచర్ల: ఎన్నికల కమిషన్ నిబంధనలపై అవగాహనతో విధులు నిర్వహించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. స్థానిక మానుకొండ కల్యాణ మండపంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎక్కడా రాజీపడకుండా, నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా, సమర్థంగా నిర్వహించాలని కోరారు. ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. సమావేశానికి గైర్హాజరు సభ్యులపై చర్యలకు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై ఎన్నికల విధి విధానాలపై ఆయన అవగాహన సమావేశం నిర్వహించారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డిబార్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తు పట్టుబడ్డారు. బుధవారం జూనియర్ ఇంటర్మీడియెట్ గణితశాస్త్రం-1 పరీక్షలో గురజాల ఉఆర్ఆర్ నవోదయ కళాశాలలో ఒకరు, చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలలో ఒకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు ఇంటర్ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తెలిపారు. కాగా, జిల్లాలో జూనియర్ ఇంటర్మీడియెట్ పరీక్షకు 885 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. జనరల్ ఇంటర్మీడియెట్‌లో 16,149మందికి గాను 15,414 మంది హాజరయ్యారని, మరో 735 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 925 మందికి గాను 805 మంది హాజరుకాగా, 120 మంది గైర్హాజరయ్యారు.

విద్యా కాంతులు మెరవాలంటీరో

వెనిగండ్ల గ్రామ సిగన సువర్ణాక్షరం

- విద్యార్థుల భవితను తీర్చిదిద్దే వినూత్న ఆలోచన
- శ్రీవేమన జెడ్పీ హైస్కూల్లో వలంటీర్ వ్యవస్థ
- ప్రత్యేక తరగతుల నిర్వహణకు 13 మంది నియామకం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ముందుకు
- చిన్నగా మొదలై విజయవంతంగా అమలు
- పేరెంట్స్ కమిటీ, గ్రామస్తుల సమష్టి కృషి ఫలితమే

అక్షరాలే హరివిల్లులై విరిసినట్టు.. విద్యాకాంతులు ఉషస్సులై ఉదయించినట్టు.. ప్రతిభా సుమాలు సువర్ణమాలై గ్రామ సిగన అలంకరించినట్టు.. ఆ గ్రామస్తుల మదిలో తళుక్కున మెరిసిన ఆలోచన నవ కిరణాలై బడి ముంగిళ్లలో తళుకులీనినట్టు.. వెనిగండ్ల గ్రామం నవోదయానికి ఆహ్వానం పలికింది. అద్భుతాల ఆవిష్కరణకు బాటలు వేసింది. అక్షరాస్యత పెంచాలని తలంచిన గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించినట్టే శ్రీవేమన జెడ్పీ హైస్కూల్లో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు.



శ్రద్ధగా ఆలకిస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) పాఠశాలలో ఐఎఫ్‌పీ విధానంలో బోధన

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని శ్రీవేమన జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడికి గ్రామంతోపాటు సమీప గ్రామాలైన అగతవరప్పాడు, పెదకాకాని నుంచి విద్యార్థులు వస్తుంటారు. వీరిలో పేదవర్గాల వారే ఎక్కువ. ఎక్కువ మంది వ్యవసాయ కూలీల పిల్లలే. వీరికి ఇళ్ల వద్ద చదువుకునే పరిస్థితులు ఉండవు. మార్గదర్శనం చేసేవారూ ఉండరు. దీనివల్ల విద్యాప్రమాణాలు సన్నగిల్లే అవకాశం ఉందనే ఉద్దేశంతో వెనిగండ్ల గ్రామపెద్దలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యావలంటీర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విషయమై తల్లిదండ్రులతో పలుమార్లు చర్చించి వారి అంగీకారం తీసుకున్నారు. గ్రామంలోనే ఉన్నత విద్యార్హత (బీఏ, బీకాం, బీఎస్సీ, బీటెక్ అర్హతలు కలిగినవారితో పాటు బీఏ బీఈడీ, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ హిందీ పండిట్, ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ ఎంఫిల్) ఉన్న 13 మంది యువతీయువకులను నియమించారు. వీరు పాఠశాలలో 6,7,8,9 తరగతుల విద్యార్థులకు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో హోం వర్క్ పూర్తి చేయించడంతోపాటు ఆ రోజు చెప్పిన పాఠ్యాంశాలను మరోసారి చదివించి, వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 5.30 వరకు తరగతులు సాగుతున్నాయి.

గతంలోనూ ప్రత్యేక తరగతులు

ఈ పాఠశాలలో గతంలో 1986 నుంచి 2013 వరకు ఏడు, పది తరగతుల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు. దాదాపు పదేళ్ల నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ లేదు. పరీక్షల సమయంలో కేవలం పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

2018 నుంచి పదవ తరగతి ఫలితాలు ఇలా..

సంవత్సరం	ఫలితాల శాతం
2018-19	97
2019-20	100
2020-21	100
2021-22	78
2022-23	79

జిల్లాస్థాయిలో గుర్తింపు

శ్రీవేమన జెడ్పీ హైస్కూల్‌కు జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. వెనిగండ్లలో పుట్టి, పెరిగి ఇదే పాఠశాలలో టెన్త్ పూర్తి చేసుకుని వెళ్లిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. ఏటా పదో తరగతి పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు సత్తాచాటుతున్నారు. టాప్-5లో స్థానం సంపాదిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రెండేళ్లపాటు వరుసగా నూరుశాతం ఫలితాలు సాధించింది. ఈ పాఠశాల అప్‌గ్రేడ్ కావడంతో ఇక్కడ రెండేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం 63 మంది ఇంటర్ చదువుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆకాంక్ష

మనబడి నాడు–నేడు మొదటి దశలో రూ.65 లక్షలతో పాఠశాలను ఆధునికీకరించిన ప్రభుత్వం, సకల వసతులను కల్పించింది. ప్రస్తుతం రెండో దశలో రూ.30 లక్షల నిధులతో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ప్రతి తరగతి గదిలో ఐఎఫ్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. 8, 9 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు అందాయి. ఆధునిక తరగతి గదులతోపాటు సువిశాల ప్రాంగణం పచ్చదనంతో ఆకట్టుకుంటుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో చేపట్టిన ఈ వలంటీర్ల వ్యవస్థను ప్రతి పాఠశాలలో అమలు చేస్తే బాగుంటుందనే ఆకాంక్ష గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతోంది.

బాబు బూటకపు మాటలు నమ్మవద్దు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు శాశ్వత హక్కు పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అచ్చంపేట మండలంలో 3,800 మందికి నివేశన స్థలాలు ఇచ్చామని, 2,400 మంది స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి శాశ్వత హక్కు పత్రాలను ఇస్తున్నామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. అచ్చంపేటలో రూ.5.50 కోట్లతో జలజీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలివ్వనున్నట్లు చెప్పారు. అమరావతి నుంచి బెల్లంకొండ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అచ్చంపేటను రూ.20కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతర్ల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ఎస్సార్కే సాయిరెడ్డి, సర్పంచి షేక్ జానీ, మాజీ సర్పంచులు కంబాల వీరబాబు, టీపీఎస్ మల్లికార్జునరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మేకల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆర్.చిన్న యల్లమందయ్య పాల్గొన్నారు.



ఇంటి స్థలాలకు శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

కోటప్పకొండకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- డిపో మేనేజర్ బి.వీరాస్వామి
- పల్నాడు, ప్రకాశం, బాపట్ల నుంచి 528 బస్సులు ఏర్పాటు
- 1300మంది అధికారులు, సిబ్బంది నియామకం
- నరసరావుపేట రైల్వేస్టేషన్ నుంచి కొండకు ఐదు బస్సులు



నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ వద్ద నిర్వహించే మహా తిరునాళ్లకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. డిపో ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కొండకు భక్తులను తీసుకొచ్చేందుకు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి మొత్తం 528 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కొండ కింది నుంచి పైకి వీఐపీలను 20 సూపర్ లగ్జరీ బస్సుల ద్వారా తీసుకెళ్లటం జరుగుతుందని చెప్పారు. గురువారం రాత్రి 12 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 12గంటల వరకు సర్వీసులు ఉంటాయని వివరించారు. దీంతో పాటు ప్రయాణికులను కొండ కింది నుంచి పైకి చేర్చేందుకు 60 తిరుమల– తిరుపతికి చెందిన సప్తగిరి బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు టిక్కెట్ ధరలు 2019 నుంచి ఉన్న వాటినే కొనసాగిస్తున్నామన్నారు. పట్టణంలోని చిత్రాలయ థియేటర్ నుంచి కూడా కొండకు బస్సులు తిరుగుతాయన్నారు. టికెట్ల కోసం అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాను, పోను టికెట్లు ఒకేసారి తీసుకున్న భక్తులు వాటిని తొమ్మిదో తేదీ ఉదయం 6గంటలవరకు ఉపయోగించవచ్చన్నారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ నుంచి కొండవరకు ఐదు బస్సులను ఏర్పాటు చేశామని, ఇవి రైలు స్టేషన్‌కు వచ్చిన సమయంలోనే అందుబాటులో ఉంటాయన్నారు. గతేడాది సుమారు 5 లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణించారని, వీఐపీలు సుమారుగా 66 వేల మందిని కొండ పైకి చేర్చటం జరిగిందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో శివ భక్తుడి మృతి





ఘటనా స్థలంలో పెద్దిరాజు మృతదేహం(ఇన్‌సెట్)

పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో శివ భక్తుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామంలోని అల్లవారిపాలేనికి చెందిన చిమటా పెద్దిరాజు(34), కావటి శ్రీనివాసరావు బుధవారం తెల్లవారుజామున బైక్‌పై అమరావతి బయలుదేరారు. ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి అడ్డరోడ్డు మీదగా కాలచక్ర రోడ్డుపై అమరావతి వెళ్తున్న సమయంలో పెదకూరపాడు వైఎస్సార్ సీపీ కార్యాలయం సమీపంలో లో లెవెల్ చప్టా వద్ద తెల్లవారుజామున లారీ ఢీకొట్టింది.

బైక్ నడుపుతున్న చిమటా పెద్దిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక ఉన్న కావటి శ్రీనివాసరావు కాలు, తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు 108 సమాచారం ఇవ్వడంతో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మృతుడు పెద్దిరాజు మంగళవారం రాత్రి శ్రీశైలం నుంచి ఫిరంగిపురానికి చేరుకున్నారు. మృతుడు భవన నిర్మాణ కార్మికుడు. మృతుడికి భార్య తిరుపతమ్మ, పిల్లలు తొమ్మిదేళ్ల హేమలత, ఏడాది లావణ్య ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ విపర్ల వెంకట్రావు పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పెదకూరపాడుకు చెందిన లారీని గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం



అశోక్(ఫైల్)

చిలకలూరిపేట టౌన్/యడ్లపాడు: టిప్పర్ ఢీకొని యడ్లపాడు స్టేషన్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. యడ్లపాడు స్టేషన్‌లో ఎస్.అశోక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వెంకటప్పయ్య కాలనీలో నివాసం ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నరసరావుపేట మండలం కోటప్పకొండ వద్ద బుధవారం ఉదయం విధులకు హాజరై సాయంత్రం తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. చిలకలూరిపేట పట్టణంలోని చెరువు మార్గంలోని టిడ్కో గృహాల సమీపంలో ఉన్న బైపాస్ వంతెన కిందుగా వస్తుండగా అదే సమయంలో అటువైపు వస్తున్న గ్రావెల్ లోడుతో వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొంది. కిందపడిన అశోక్‌పై మీదుగా టైర్ వెళ్లడంతో శరీరంలో సగ భాగం పూర్తిగా దెబ్బతింది. సమీపంలో పనులు నిర్వహిస్తున్న బైపాస్ కార్మికులు గమనించి వారి వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు నిర్వహించేలోపే తీవ్ర గాయాలైన అశోక్ మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వైద్యకళాశాలలో మహిళా దినోత్సవం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికో ఉద్యోగ సంఘం గుంటూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) శోభారాణి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుగుణ, జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడారు.

జిల్లాలో 2,126 టన్నుల కందుల సేకరణ

నరసరావుపేట: జిల్లాలో 140 రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 2126 మెట్రిక్ టన్నుల కందులను 1,344 రైతుల ద్వారా సేకరించి జిల్లాలోని 15 దాల్‌మిల్లులకు పంపించటం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం మాచర్లలోని శ్రీ శ్రీనివాస దాల్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కందిపప్పు మిల్లింగ్, తయారీ విధానం పరిశీలించారు. జిల్లాలో 17,300 హెక్టార్లలో కందిపంట సాగు చేశారని, 25వేల మెట్రిక్ టన్నులు కందుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆ కందులను కొనుగోలు చేసేందుకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కందులు విక్రయించిన 1296 మంది రైతులకు నాలుగైదు రోజుల వ్యవధిలోనే రూ.17.42 కోట్లను వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయటం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా మద్దతు రూ.9722.9లకు గన్నీ బ్యాగు ఖర్చులతో సహా కొనుగోలు చేయటం జరిగిందన్నారు. జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి, మాచర్ల తహసీల్దార్ పాల్గొన్నారు.

క్రీస్తు నామంతో విజయాలు

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- 47వ గుడారాల పండుగ ప్రారంభ ప్రార్థన



గుంటూరు రూరల్: క్రీస్తు నామంలో విజయాలు సొంతమవుతాయని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీలు తెలిపారు. అమరావతిరోడ్డు గోరంట్ల గ్రామంలోగల హోసన్న మినిస్ట్రీస్ 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో బుధవారం ప్రారంభ ప్రార్థన, స్టేజ్ డెడికేషన్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ అబ్రహాం, పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తుని స్తుతి గీతాలు ఆలపించారు. ప్రతి ఏటా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలవలే గుడారాల పండుగకు హాజరయ్యే ప్రతి క్రీస్తుని భక్తునికి ఆయురారోగ్యాలు, క్రీస్తుని కృప కలగాలని క్రీస్తుని భక్తులు సుఖసంతోషాలతో క్రీస్తు నామంలో జీవించాలని ఆకాంక్షించారు. గుడారాల పండుగ కార్యక్రమంలో భాగంగా హోసన్న మినిస్ట్రీస్ సిస్టర్స్, బ్రదర్స్ క్రీస్తుని గీతాలను ఆలపించారు. హోసన్న జయమనరే అంటూ, హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా అంటూ క్రీస్తుని నామాన్ని ఘనపరిచారు. గుడారాల పండుగకు వచ్చే భక్తులకు వసతి, భోజన ఏర్పాట్లు చేశారు. రాత్రి ప్రత్యేక ప్రార్థనలకు భారీ విద్యుత్ కాంతులతో కూడిన లైట్లు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేశారు. పగలు ప్రత్యేక ప్రార్థనలకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకోసం వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌టీసీ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాటు చేశారు. 7వ తేదీ సాయంత్రం నుంచి 10వ తేదీ మధ్యాహ్నం వరకూ జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో సుమారు 20 లక్షల మంది క్రీస్తుని భక్తులు పాల్గొంటారని సమాచారం.

వైభవం.. బ్రహ్మోత్సవం

పెదకాకాని శివాలయంలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పెండ్లికుమార్తెగా భ్రమరాంబ అమ్మవారు

పెదకాకాని: శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవాలను బుధవారం అర్చకులు పూజా కార్యక్రమాలతో సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. మల్లేశ్వరస్వామివారిని పెండ్లి కుమారునిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకే సుప్రభాత సేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాల క్రతువు ప్రారంభమైంది. శైవాగమ పద్ధతిలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో అర్చకస్వాములు, వేద పండితులు తొలిరోజు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండవరోజు గురువారం శ్రీ భ్రమరాంబ అమ్మవారిని వనదుర్గాదేవిగా అలంకరించడం జరుగుతుందని, ప్రత్యేక వేదికపై శ్రీరామలింగ ప్రతిష్ఠ ఏర్పాటు చేయడం జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు నరనంది వాహనంపై అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ ఉప కమీషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు.



పూజా క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు..

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ ఉప కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు కొమ్మూరి కోటిరత్నాలు, కారంకి నాగేశ్వరమ్మ, మందాళ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.